
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 14 ఏప్రిల్ 2025





ఓ మహిళా రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు



జీడీఏలు లేకపోవడంతో రోగులను తీసుకెళ్తున్న బంధువులు



ఓపీ కౌంటర్ వద్ద ఇలా..

ఆంధ్రజ్యోతి విజిట్

వైద్యం.. దైన్యం..!

- గంటల తరబడి నిరీక్షణ
- అందుబాటులో లేని వైద్యులు
- హౌస్ సర్జన్లు, నర్సులతోనే సేవలు
- స్కానింగ్, ఎక్స్‌రేకూ తప్పని కష్టాలు
- వేధిస్తోన్న జీడీఏల కొరత
- నంద్యాల ప్రభుత్వాసుపత్రి తీరిది

నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు దయనీయంగా మారాయి. కొందరు వైద్యులు పని వేళలు పాటించడం లేదు. హౌస్ సర్జన్లు, నర్సులే రోగులకు దిక్కయ్యారు. నంద్యాల ఆసుపత్రికి ఇటీవల రోగుల తాకిడి ఎక్కువైంది. దీంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఓపీ మొదలుకుని వార్డుల్లో అందే సేవల వరకు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటికితోడు వైద్యులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో రోజూ వెయ్యి నుంచి 1,200 మంది వరకు రోగులు వస్తున్నారు. ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో పడకలు లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. కొందరైతే బయట వరండాలో సేద తీరాల్సిన దుస్థితి.

-నంద్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

స్కానింగ్, ఎక్స్‌రేలకు కష్టాలు..

ఎవరైనా వార్డుల్లో చికిత్స పొందుతున్న వారికి ఏదైనా ఎక్స్‌రే, ఎంఆర్ఐ, స్కానింగ్ తీయించుకోవాలంటే నరకం కనిపిస్తోంది. రోగులను తరలించే జీడీఏ(జనరల్ డ్యూటీ అసిస్టెంట్లు) అందుబాటులో లేకపోవడంతో బంధువులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, బాలింతల పరిస్థితి మరింత దయనీయం. ఎంఆర్ఐ రిపోర్ట్ రావాలంటే.. రెండు నుంచి ఐదు రోజులు కూడా పడుతోందని రోగులు ఆరోపిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రతిరోజు ఎంఆర్ఐ స్కానింగ్‌కు 35 నుంచి 50 మంది వరకు, సీటీ స్కానింగ్‌కు 60 నుంచి 70 మంది రోగులు వస్తున్నారు.



స్కానింగ్ వద్ద నిరీక్షిస్తున్న రోగులు

గంటల తరబడి ఉండాల్సిందే



కాళ్లు చచ్చుగా ఉండి తిమ్మిర్లు ఉండటంతో ఆసుపత్రికి వచ్చా. వైద్యులు సీటీ స్కాన్ రాసిచ్చారు. ఇక్కడకు వస్తే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వృద్ధులు, వికలాంగులు, నడవలేని వారి పరిస్థితి ఇక్కడ ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి త్వరగా స్కానింగ్ సేవలు అందేలా చూడాలి.

- శారద, కొత్తపల్లి

జీడీఏల కొరత

ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో రోగులను తరలించే జీడీఏ(జనరల్ డ్యూటీ అసిస్టెంట్లు) సిబ్బంది లేకపోవడంతో ఆయా సేవల్లో తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆసుపత్రికి 75 మంది జీడీఏలు ఉండాల్సి ఉండగా.. కేవలం 35మంది మాత్రమే ఉన్నారు. ఈ సమస్యను కొందరు తమకు అనుకూలంగా మార్చుకుని రోగులను తరలించేందుకు డబ్బు డిమాండ్ చేస్తున్నారని రోగుల ఆవేదన. ఆసుపత్రిలో జీడీఏలపై పర్యవేక్షణ కూడా లేకపోవడంతోనే వారి సేవల్లో నాణ్యత లోపిస్తోంది. ఇప్పటికైనా ఆసుపత్రి ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టిసారించి ఆశించిన స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



డబ్బు ఇస్తేనే కట్లు కడుతున్నారు..



అందరికంటే ముందుగా వచ్చాం. వైద్యుల వద్ద చూపించుకుని కట్లు కట్టించుకునేందుకు వస్తే మా వెనక వచ్చిన వారికి కట్లు కడుతున్నారు. కొందరి వద్ద డబ్బు తీసుకొని త్వరగా కట్లు కట్టి పంపిస్తున్నారు. ఇదేమని అడిగిన ప్రతిసారి మరింత ఆలస్యం చేస్తున్నారు. నా భర్తకు కట్టు కట్టించుకోవడానికి గంటల తరబడి నిరీక్షించా. చాలా మందిది ఇదే పరిస్థితి.

- వెంకటసుబ్బమ్మ, శిరివెళ్ల



వివరాలను నమోదు చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

పట్టించుకునే నాథుడే లేరు



మాది నంద్యాల మండలం పోలూరు గ్రామం. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా. ఆసుపత్రికి వస్తే వృద్ధురాలు అన్న దయ కూడా చూపకుండా పట్టించుకోలేదు. వైద్యులు చూస్తే వార్డులో అడ్మిట్ కావాలని చెప్పి పంపిస్తున్నారు. నడకవలేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- లక్ష్మీదేవి

మెరుగైన వైద్యం అందించేలా చూస్తాం



ఆసుపత్రిలో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించేలా చూస్తాం. విధుల్లో సమయ పాలన పాటించని వైద్యులు, వైద్య సిబ్బందిపై నిఘా ఉంచుతాం. రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బందిపై దృష్టిపెడతాం. ఓపీ, వార్డుల్లో కూడా రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు..రోగులను తరలించే జీడీఏల కొరత ఉంది. దీంతో వైద్య సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వరి, సూపరింటెండెంట్, నంద్యాల జీజీహెచ్



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

మౌలిక సదుపాయాలు కల్పించండి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల హస్పిటల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు చేసేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అత్యవసర వైద్యసేవలు అందించేందుకు క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు ఆమోదించామన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అవసరమైన పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్యలోపం, టాయ్‌లెట్‌ల నిర్వహణ లేకపోవడం, తాగునీటి సమస్య, పరికరాలు ఉన్నా టెక్నీషియన్‌లు లేకపోవడం తదితర లోపాలు ఉన్నట్లు ఆసుపత్రి డెవలప్‌మెంట్ సభ్యులు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీదేవి, శ్రీరామమూర్తి, శివశంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ప్రొఫెసర్ల పాగా

- స్థానిక ప్రొఫెసర్లలో ముసలం..
- ఆర్‌యూ, క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీల్లో నిత్యం వివాదాలు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 3 యూనివర్సిటీలలో కడప జిల్లాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాగా వేశారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన వారినే అందలం ఎక్కించారని కొందరు ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీలకు రిజిస్ట్రార్లు, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి కడప జిల్లాకు చెందిన వారిని నియమించడంతో పాలన వ్యవహారాల్లో వారు చెప్పిందే వేదంగా మారింది. దీనికి తోడు వర్సిటీల మధ్య ఆధిపత్య పోరుకు తెరలేపుతున్నారని విద్యార్థులు మండి పడుతున్నారు. క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీ రెండింటిని ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేసి పెత్తనం అంతా ఓ వర్సిటీలో తానే చెలాయించాలనే లక్ష్యంగా ఓ అధికారి పావులు కదుపుతున్నట్లు ప్రచారం ఉంది.

రాయలసీమ వర్సిటీలో ఇలా...

రాయలసీమ యూనివర్సిటీకి ప్రభుత్వం కొత్తగా ఉపకులపతిని నియమించినా పెత్తనం అంతా ఇద్దరు మాజీ ప్రొఫెసర్లదే సాగుతోందనే ప్రచారం ఉంది. ఉపకులపతిని కేవలం సీటుకే పరిమితం చేయడంలో ఓ అధికారి పాత్ర ఉందని విద్యార్థులు అంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను విద్యార్థులను అడ్డుపెట్టుకొని బలవంతంగా రాజీనామా చేయించి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ అదనంగా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ బాధ్యతలు తన వద్దే పెట్టుకోవడంతో స్థానికంగా పని చేస్తున్న ప్రొఫెసర్లు గుర్రుగా ఉన్నారనే ప్రచారం ఉంది. కొన్ని వివాదాస్పదఅంశాలు, కోర్టు కేసులో ముడి పడి ఉన్న పోస్టులను దగ్గరుండి నడిపించి తనకేమి సంబంధం లేదని, వర్సిటీలో ప్రొఫెసర్లను రెండు వర్గాలుగా చీల్చి ఒక వర్గాన్ని తనకు అనుకూలంగా మలచుకుని వర్సిటీ రాజకీయాలను శాసిస్తున్నాడనే విమర్శలున్నాయి.

- క్లస్టర్ వర్సిటీలో...

క్లస్టర్ వర్సిటీలో కూడా ఆధిపత్య పోరుతో పాలన గాడి తప్పిందనే ప్రచారం ఉంది. కేవీఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాళ్ల మధ్య రెండేళ్ల పాటు కోల్డ్‌వార్ జరగడంతో ఇద్దరు ప్రిన్సిపాల్స్‌ను, అప్పటి రిజిస్ట్రార్‌ను బదిలీ చేశారు. ఆ తర్వాత కడప జిల్లా నుంచి వచ్చిన రిజిస్ట్రార్ మరి కొందరు ఆధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రభుత్వానికి లేఖలు రాయడం, ఉర్దూ యూనివర్సిటీ అధికారులు వారికి వ్యతిరేకంగా మైనార్టీ వర్గాలను డిగ్రీ కళాశాల పరిశీలనకు పంపారు. దీనితోపాటు మంత్రి టీజీ భరత్‌ను ఇందులోకి లాగారు. వీటన్నింటి వల్ల విశ్వవిద్యాలయాల పాలన రోడ్డున పడిందని ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు.

మెరుగుపడాలి..!

- ఇంటర్ ఫలితాలపై సర్వత్రా ఆందోళన
- ప్రభుత్వ కళాశాలల్లో భయపెడుతున్న హాజరు శాతం
- నూతన విద్యావిధానంలోనైనా మెరుగుపడేనా..?

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా గతంలో కన్నా కాస్త పర్వాలేదనిపించింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై ఇటు విద్యార్థుల్లో అటు విద్యాశాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా మెరుగైన ఫలితాలు వచ్చాయి. కానీ నంద్యాల జిల్లాలో 60 శాతం మాత్రమే ఉత్తీర్ణత రావడంపై అధికారులు సమాలోచనలో పడ్డారు. కొన్ని ప్రభుత్వ కళాశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించినా మరికొన్ని కళాశాలలు ఫలితాల్లో పూర్తిస్థాయిలో వెనుకబడిపోవడమే ఇందుకు కారణం. దీనిపై పలువురు విద్యానిపుణులు సైతం హాజరుశాతం లోపంతోనే మరింత మెరుగైన ఫలితాలను సాధించలేకపోతున్నామని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ వచ్చే ఏడాదికి మెరుగైన ఫలితాలు సాధించే దిశగా అధికారులు పరుగులు తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నంద్యాల జిల్లా వ్యాప్తంగా 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,441 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,161 మంది ఉత్తీర్ణులై 46 శాతానికే పరిమితమయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో కూడా 1,518 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,143 మంది ఉత్తీర్ణులై 75శాతం ఫలితాలు రాబట్టి కాస్త ఊరటనిచ్చారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ కళాశాలల్లో నంద్యాల జిల్లా జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 11వ స్థానంలో ఉండగా, సీనియర్ ఇంటర్‌లో 6వ స్థానంలో నిలిచింది. జూనియర్ ఇంటర్‌లో గోస్పాడు ప్రభుత్వ కళాశాల 89.43 శాతంతో మొదటిస్థానం సాధించగా, సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేవలం 13 శాతంలో చాలా వెనుకబడి ఉంది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా గోస్పాడు మొదటిస్థానంలో, సంజామల చివరిస్థానంలో నిలిచింది.
- జిల్లాలో 19 మోడల్ కళాశాలలు ఉండగా మొదటి సంవత్సరంలో 1,474 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 957 మంది ఉత్తీర్ణులై 53.91 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 946 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 814 మంది ఉత్తీర్ణులై 82శాతం ఫలితాలను సాధించారు. ఇందులో జూనియర్ ఇంటర్‌లో గోస్పాడు మోడల్ కళాశాల 91.51 శాతంతో మొదటి స్థానంలో ఉండగా జూపాడుబంగ్లా మోడల్ కళాశాల 39 శాతంతో వెనుకబడింది. ద్వితీయ సంవత్సరంలో పాణ్యం మోడల్ కళాశాల వందకు వందశాతం ఫలితాలు సాధించగా కొలిమిగుండ్ల మోడల్ కళాశాల 59 శాతంలో వెనుకంజలో ఉంది.



- జిల్లాలో 3 ఏపీ బీసీ వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 244 మంది పరీక్షలు రాస్తే 229 మంది ఉత్తీర్ణులై 93శాతం ఫలితాలను సాధించారు. జూనియర్ ఇంటర్‌లో నెరవాడ బీసీ కళాశాల 97శాతంతో మొదటిస్థానంలో ఉండగా 86శాతంతో డోన్ చివరిస్థానంలో ఉంది. అలాగే సీనియర్ ఇంటర్‌లో 166 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 158 మంది ఉత్తీర్ణులై 95శాతం ఫలితాన్ని సాధించారు. అందులో నెరవాడ 100శాతం, డోన్ 68శాతం సాధించాయి.
- జిల్లాలో 6 సోషల్ వెల్ఫేర్ కళాశాలలు ఉండగా 394 మంది పరీక్షలు రాయగా 360 మంది ఉత్తీర్ణులై 91శాతం సాధించారు. అందులో జూనియర్ ఇంటర్‌లో పగిడ్యాల మండలం లక్ష్మాపురం కళాశాల 97శాతంతో మొదటిస్థానం, కోవెలకుంట్ల కళాశాల 85శాతంతో కాస్త వెనుకబడివుంది సీనియర్ ఇంటర్‌లో 348 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 97శాతం ఫలితాలను సాధించారు. అందులో జూనియర్ ఇంటర్‌లో పగిడ్యాల 98శాతంతో మొదటిస్థానం, ఆళ్లగడ్డ 96శాతంతో చివరిస్థానంలో నిలిచింది.
- జిల్లాలో 27 కేజీబీవీ కళాశాలలు ఉండగా జూనియర్ ఇంటర్‌లో 763 మంది పరీక్షలు రాయగా 442 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులై 57.92శాతం సాధించారు. అందులో కేజీబీవీ గోస్పాడు 100శాతం సాధించగా కేజీబీవీ కొత్తపల్లి ఐదు శాతానికే పరిమితమైంది. సీనియర్ ఇంటర్‌లో 422 మంది పరీక్షలు వ్రాయగా 340 మంది ఉత్తీర్ణులై 80.56 శాతం ఫలితాలను సాధించారు. ఇందులో కేజీబీవీ గోస్పాడు వందశాతం ఫలితాలను సాధించగా, కేజీబీవీ పాములపాడు 25శాతంతో వెనుకంజలో ఉంది.

హాజరు శాతం మెరుగుపడాలి



ప్రభుత్వ కళాశాలల్లో మరింత మెరుగైన ఫలితాల రాబట్టాలంటే విద్యార్థుల్లో హాజరుశాతం పెరగాలి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం 60 నుంచి 70శాతం మాత్రమే హాజరవుతున్నారు. విద్యార్థుల పేదరికం కారణంగా వారి తల్లిదండ్రులు కళాశాలను ఎగురగొట్టి పనులకు పంపుతున్నారు. వారిలో ఆ ధోరణి మారి కళాశాలకు రెగ్యులర్‌గా పంపితే మంచి ఫలితాలను సాధించవచ్చు

- శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా

ప్రత్యేక ఒకేషనల్ కళాశాల ఏర్పాటు చేయాలి



జిల్లాలో కుప్పంలో ఉన్న మాదిరి అన్ని వృత్తులతో కూడిన ఒకేషనల్ కళాశాలను ఏర్పాటుచేయాలి. జనరల్ ఇంటర్‌పై ఆసక్తి లేని విద్యార్థులు ఒకేషనల్ కళాశాలపై దృష్టిసారించే అవకాశం ఉంది. మారుతున్న నూతన విద్యావిధానంలో ఇంటర్‌లో కూడా మధ్యాహ్న భోజనం పథకం ద్వారా మరింత అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

- పాపోడు, ప్రభుత్వ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు

టీడీపీలో కార్యకర్తలకే అందలం

- సమన్వయంతో ముందుకు సాగాలి
- బీటీ నాయుడు ఆత్మీయ సన్మాన సభలో మంత్రి టీజీ భరత్
- అధినేత చంద్రబాబుకు రుణపడి ఉంటా : ఎమ్మెల్సీ బీటీ


ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆత్మీయ సన్మాన సభలో మంత్రి టీజీ భరత్


సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, హాజరైన నాయకులు


బీటీ నాయుడును సన్మానిస్తున్న తుగ్గలి నాగేంద్ర

కర్నూలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీలో నిబద్ధతతో పని చేసే కార్యకర్తలు, నాయకులకు అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉంటారు. అందలం ఎక్కిస్తారని, అందుకు ఎమ్మెల్యేల కోటాలో రెండోసారి ఎమ్మెల్సీగా ఎంపికై మండలిలో అడుగుపెట్టిన బీటీ నాయుడే నిదర్శనం..' అని రాష్ట్ర వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన బీటీ నాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జరిగిన ఆ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, బీటీ అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గాల స్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ టీడీపీలోనే బీసీలకు రాజకీయ చైతన్యం, పదవులు సాధ్యమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ అధినేత చంద్రబాబు ఏ పని అప్పగించినా క్రమశిక్షణతో చేసేవారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ టీడీపీనే అన్నారు. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోని కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అవి నీటిమీద బుడగలే అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో బలహీనవర్గాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, ఏపీ కురువ/కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్ తదితరులు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు మనసు గెలుచుకున్న వ్యక్తి బీటీ నాయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్, సీనియర్ నాయకులు వైకుంఠం జ్యోతి ప్రసాద్, కేవీ సుబ్బారెడ్డి, గట్టు తిమ్మప్ప, నంద్యాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి. తిక్కారెడ్డి

చంద్రబాబుకు రుణపడి ఉంటా

: బీటీ నాయుడు

అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఎంతో నమ్మకంతో రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వారికి జన్మాంతరం రుణపడి ఉంటా. బీసీలకు టీడీపీ ద్వారానే రాజకీయ చైతన్యం, రాజ్యాంగబద్ధమైన పదవులు సాధ్యం అవుతాయి. క్రమశిక్షణ, నిబద్ధతతో టీడీపీలో పని చేస్తే పదవులు, బీ-ఫారంలు ఇంటికే వస్తాయి. పేర్కొన్నారు. వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్, ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారాలను టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి.

రుధిరంతో అంబేడ్కర్ చిత్రం


రుధిరంతో చిత్రీకరించిన డా.బీఆర్. అంబేడ్కర్ చిత్రం


నంద్యాల పట్టణానికి చెందిన బ్యాంక్ ఉద్యోగి మాణిక్యరావు తన రుధిరంతో అంబేడ్కర్ చిత్రాన్ని గీశారు. సోమవారం డా.బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని సందర్భంగా మాణిక్యరావు దాదాపు రెండు గంటలు శ్రమించి తన రక్తంతో అంబేడ్కర్ చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని బ్యాంకు ఉద్యోగులు అందరూ చూసి శభాష్ అని అంటున్నారు.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రీయ ఆయుష్ అసోసియేషన్ ఏర్పాటు

జిల్లా అధ్యక్షుడిగా పీవీ నాగరాజు



ఎన్నికైన ఆయుష్ అసోసియేషన్ వైద్యులు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన సీనియర్ ఆయుర్వేద వైద్యుడు డా. పీవీ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని బుధవారపేటలో జిల్లా ఆయుష్ వైద్యుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డా. బంగారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులు డా. డీపీ పద్మనాభ రెడ్డి, డా. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డా.జే. మధుభూషణ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డా. నవీన్ కుమార్, ట్రెజరర్ డా.రజాక్ బాషా ఎన్నికయ్యారు.

కంచి యూనివర్శిటీలో ఉత్తమ విద్యావకాశాలు

వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న కంచి యూనివర్సిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ వ్యక్తిత్వంతోపాటు గొప్ప భవిష్యత్తును అందించే దిశగా కంచి యూనివర్శిటీలో అనేక విద్యావకాశాలు ఉన్నాయని కంచి యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాత నగరంలోని శంకరమందిరం ఎదురుగా ఉన్న కరివేన బ్రాహ్మణ నిత్యాన్న సత్రం కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ అందజేస్తున్న కోర్సులు, వాటి ఫీజుల వివరాలు, విద్యావకాశాలు, ఉపకారవేతనాలు తదితర అంశాలను వారు వివరించారు. తమిళనాడు రాష్ట్రంలోని కంచిలో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం (కంచి యూనివర్సిటీ)లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వివరాలకు అడ్మిన్ నాగేశ్వరరావు సెల్ నెం. 96550 35217లో సంప్రదించాలని సూచించారు.

బ్యాగ్ అప్పగింత

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ బ్యాగ్ మరిచిపోయిన ఓ వ్యక్తికి కర్నూలు పోలీసులు అప్పగించారు. కొత్తపల్లికు చెందిన శ్రీధర్ బ్యాంకు ఉద్యోగి. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాలులో పెళ్లికి హాజరయ్యాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఆటో ఎక్కి సుంకేసుల రోడ్డులో ఉన్న ఓ ఆసు పత్రికి వెళ్లాడు. ఆసుపత్రికి వెళ్లిన తర్వాత బ్యాగు మరిచిపోయినట్లు గుర్తించాడు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి ఆటో నెంబరును గుర్తించి బ్యాగును అతనికి అప్పగించారు. ఆ బ్యాగులో పది గ్రాముల బంగారు కమ్మల జత ఉన్నట్లు శ్రీధర్ తెలిపారు.

దివ్యాంగులు రాయితీలను ఉపయోగించుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని దివ్యాంగుల ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా దివ్యాంగుల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.శివారెడ్డి, జనరల్ సెక్రటరీ కృష్ణుడు తెలి పారు. ఆదివారం సీక్యాంపులోని కార్యాలయంలో దివ్యాంగుల ఉద్యోగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లా డుతూ సదరం సర్టిఫికేట్లు, రైల్వే సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు ఆన్‌లైన్ లోదరఖాస్తు చేసుకోవాలన్నారు. బదిరిలు బైక్, కారు డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైతే ఆయా రోస్టర్లలో తీసుకోవాలన్నారు. 216 ఉద్యోగుల చట్టంలోని అంశాలన్నింటినీ ఉపయోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీమఠంలో ఎస్‌బీఐ చైర్మన్

- రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న చైర్మన్ శ్రీనివాసులు శెట్టి
- సోలార్ ఏర్పాటుకు రూ.40 లక్షలు విరాళం
- నూతన హంగులతో ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం



శ్రీమఠానికి రూ.40 లక్షలతో సోలార్ ప్లాంటు పీఠాధిపతికి విరాళంగా ఇస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసుల శెట్టి

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఎస్‌బీఐ చైర్మన్ గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమొంటో, శేషవస్త్రం, పరిమళప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రాలయంలో నూతన హంగులతో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఆయన మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోలార్ ఫలకాలను నిర్మించేందుకు ఎస్‌బీఐ చైర్మన్ రూ.40 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి చీఫ్ జనరల్ మేనేజర్లు రాజేష్ కుమార్ పాటిల్, సంజయ్ కుమార్, దినేష్‌గులాటి, ఆర్ఎం శ్రీనివాసులు, మంత్రాలయం మేనేజర్ రాజశేఖర్, రామచంద్ర నాయక్, కృష్ణవేణి, రవి, వీరేష్, నరసప్ప, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బ్యాంకు సిబ్బంది కిరణ్ కుమార్, రావూఫ్, నరసప్ప, ప్రసాద్, మహేష్, ఉరుకుందమ్మ, వీరేష్, విశోభ, రవి, రహంతుల్లా, మహబూబ్ బాషా, సద్దాం హుశేన్‌లు పాల్గొన్నారు.

శ్రీమఠానికి ఎస్ఐబీఐ సహకారం

శ్రీమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎస్‌బీఐ తోడ్పాటు ఇస్తూనే పరస్పర సహకారం అందిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. గతంలో ఎస్‌బీఐ ద్వారా సహకారం అందించామని, భవిష్యత్‌లో కూడా పూర్తి సహకారం అందిస్తామన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు వల్ల శ్రీమఠానికి విద్యుత్ ఆదా అవుతుందన్నారు.

బ్యాంకింగ్ రంగంలో దూసుకున్న పోతున్న ఎస్‌బీఐ

ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ మెరుగైన సేవలు అందిస్తూ దూసుకుపోతోందని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కొనియాడారు. ఎస్‌బీఐ వ్యాపారస్థులు, రైతులు, పొదుపు గ్రూపు మహిళలకు అండగా ఉంటూ భద్రతకు మారుపేరుగా నిలిచిందన్నారు. రూ.40 లక్షలతో సోలార్ ప్రాజెక్టు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు.

ఎల్లెల్సీలో యువకుడు గల్లంతు

హాలహర్వి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూళ్యంకి చెందిన శివప్ప(22)అనే యువకుడు ఎల్లెల్సీలో గల్లంతైనట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శివప్ప ఆదివారం పొలానికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి మారెప్ప పొలం వద్దకు వెళ్లి వెతికాడు. అక్కడ కనిపించకపోవడంతో ఎల్ఎల్‌సీ కాల్వలో వెతుకులాట సాగించాడు. కాల్వలో కొంత దూరంలో శివప్ప శవం బయటపడింది. దీంతో ఆగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి వెంకటేశ్(33) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. తమిళనాడుకు చెందిన రాజేశ్వరి అనే మహిళను గ్రామానికి తీసుకొచ్చి ఇద్దరూ సహజీవనం చేస్తుండేవారు. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఆ మహిళ గత నెల 14న వెంకటేశ్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది వెంకటేశ్ కూడా ఇంట్లో చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

రేపు టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ వేడుకలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, మొదటి తెలుగు నాటక రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటకరంగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, అరుణభారతి వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రాజారెడ్డి తదితర ముఖ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా నాటక రంగానికి విశేష సేవలు అందించిన 12 మంది సంగీత గురువులు, కళాకారులను 'కందుకూరి పురస్కారం'తో సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సత్య హరిశ్చంద్ర నాటకం (కాటిసీను) ఉంటుందని, ఇందులో సత్య హరిశ్చంద్రునిగా చల్లా నవీన్ కుమార్ చౌదరి, చంద్రమతిగా ఎంఆర్ రాధిక నటిస్తారని, సంగీత సహకారం ఎర్రమ పాండురంగయ్య అందజేస్తారని తెలిపారు. తర్వాత శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) ఉంటుందని, ఇందులో శ్రీకృష్ణునిగా జీవీ శ్రీనివాసరెడ్డి, దుర్యోధనుడిగా కేవీ రమణ, అర్జునుడిగా కె.బాలవెంకటేశ్వర్లు నటిస్తారని, బలరాం సంగీత సహకారం అందిస్తారని వివరించారు. కళాకారులు, కళాభిమానులు ఈ వేడుకలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంట్లో చోరీ

40 తులాల బంగారు ఆభరణాలు దొంగతనం


బాధితుని ఇంట్లో చోరీ జరిగిన అల్మారలు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయివైభవ్ నగర్‌లో ఆర్టీసీ డిపో-2 మేనేజర్ సర్దార్ హుశేన్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. సర్దార్ హుశేన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాదు వెళ్లారు. స్థానికులు ఆదివారం ఈయన ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇచ్చారు. దీంతో బాధితుడు హైదరాబాదు నుంచే పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సర్దార్ హుశేన్ వచ్చి పరిశీలించగా... ఇంటి ప్రధాన ద్వారం తలుపు పగులకొట్టి పడకగదిలోని బీరువాలో ఉన్న అల్మారాలో 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. మరి కొన్ని బంగారు ఆభరణాలు వేరే అల్మారాలో పెట్టడంతో అవి సురక్షితంగా ఉన్నాయి. సమీపంలో ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడంతో పోలీసులు చోరీకి ఆధారాలు గ్రహించలేకపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 12 మందిపై కేసు నమోదు
- సాతనూరులో ఘటన


సాతనూరులో డా.బీఆర్ అంబేడ్కర్ బ్యానర్‌ను తొలగిస్తున్న దళిత వర్గం నాయకులు

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో దళితుల్లోని ఇరు వర్గాల ప్రజలు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాతనూరు గ్రామంలో అగసనూరు, చిర్తనకల్ గ్రామాలకు వెళ్లే మలుపు రోడ్డు వద్ద గ్రామానికి చెందిన ఇరువర్గాల దళితులు ఏపీ దళిత ఐక్యవేదిక బోర్డు ఏర్పాటు చేసే విషయంలో గొడవ పడి పరస్పరం గాయాలు చేసుకున్నారు. ఇరువర్గాల దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గానికి చెందిన హెచ్. రాజుతో పాటు ఐదుగురిపైన, మరో వర్గానికి చెందిన హెచ్. హను మయ్యతో పాటు మరో ఐదుగురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకల కోసం స్థలం విషయంలో ఈ ఘర్షణ జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక


మొలగవల్లి జడ్పీఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆలూరు , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 26 ఏళ్ల తర్వాత కలసి చదువుకున్న పాఠశాలల్లో కలసి తిరిగారు. ఆనాటి అల్లర్లను జ్ఞాపకం చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. సత్యనారాయణ, ఆంజనేయులు, ప్రభాకర్, హేమ, రంగస్వామి, సుధాకర్, రేఖ, పూర్వ విద్యార్థులు రవి కుమార్, భాస్కర్, రామాంజినేయులు, రంగనాథ్, బాల సుబ్రహ్మణ్యం, మారెన్న, శ్రీను పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు ఎమ్మెల్యే నివాళి


ఆదర్శ రైతు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామగట్ల గ్రామంలో ఆదర్శరైతుగా ఉన్న భాస్కర రావు(48) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయసూర్య ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడు భాస్కరరావుకు భార్యా, ఇద్దరు కుమారులున్నారు. ఈయన మృతికి సర్పంచ్ మాధవరం సుశీలమ్మ, ఎంపీటీసీ తిప్పారెడ్డి, టీడీపీ నాయకులు మాధవరం రత్నమయ్య, పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

• బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి


లింగాల గ్రామంలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

పాములపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లింగాలలో బీజేపీ మండలాధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్‌తో కలసి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇంటింటికి తాగునీరు, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, మే నెలలో తల్లికి వందనం, రైతు భరోసా అందిస్తున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. గ్రామంలో అనారోగ్యంతో ఉన్న బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లును పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలయ్య, హేమచంద్ర, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య ఆచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా వర్తింపచేయాలి


బండిఆత్మకూరులో జీపుజాతాకు స్వాగతం పలికిన నాయకులు

బండిఆత్మకూరు, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ప్రమాద బీమా వర్తింపచేయాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బండిఆత్మకూరుకు జీపుజాతా చేరుకుంది. మండలంలోని పెద్దదేవళాపురం, చిన్నదేవళాపురం, నారాయణపురం, సంతజూటూరు బండిఆత్మకూరు, ఈర్నపాడు గ్రామాల్లో రాష్ట్ర వ్యకాస ఉపాధ్యక్షురాలు శివనారాణి, నరసింహ నాయక్ నేతృత్వంతో చేరింది. ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస కూలి రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని వారు కోరారు. ఇటీవల తేనెటీగల దాడిలో గాయపడిన చిన్నదేవళాపురం కూలీలను వారు పరామర్శించారు. రత్నమయ్య, రాజు, సుబ్బరాయుడు, రామచంద్రుడు, కుళాయిస్వామి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మిడుతూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కలిసి సమ్మేళన కార్య క్రమం నిర్వహించారు. వారు పాఠశాలలో తీపి గుర్తులను నెమరేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు మహేశ్వరరెడ్డి, రాజు, సాయి తిమ్మయ్య, చార్‌లెస్, చార్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, లతీఫ్, దస్తగిరి, నరసింహులు, ఫాతిమాబీను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ


ఆత్మకూరులో మట్టల ఊరేగింపు

ఆత్మకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ల తొలి పండుగైన ఈస్టర్ పండుగకు వారం రోజుల ముందు జరిపే మట్టల పండుగ ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇందిరానగర్ చర్చిలో భక్తులు ఈతమట్టలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్లు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించారు. అలాగే మట్టల పండుట ప్రాశస్త్యాన్ని వివరించారు.

ఎమ్మెల్యే వాహనం ఎదుట
'టోల్' నిర్వాహకుల ఆందోళన

• ఎస్ఐ దాడి చేశారని ఆరోపణ


ఆందోళన చేస్తున్న టోల్‌గేటు నిర్వాహకులను వారిస్తున్న పోలీసులు

నందికొట్కూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు గేటు వసూలు చేస్తున్నావని తన పై జూపాడు బంగ్లా ఎస్ఐ దాడిచేసి గాయపరిచారని టోల్ గేటు దక్కించుకున్న శంకర్‌తో పాటు ఆయన కుటుంబస భ్యులు, కమిటీ సభ్యులు ఆందోళనకు దిగారు. రథోత్సవానికి వస్తు న్న ఎమ్మెల్యే, తహసీల్దార్ వాహనాలను అడ్డుకొని రాస్తారోకో చేశారు. పంచాయతీ నిబంధనల మేరకు టోకెన్లు ఇస్తున్నానని, అధికధరలకు విక్రయిస్తు న్నారని నిరూపిస్తే గేటు వదులుకుపోతానని చెప్పడంతో తమపై దాడిచేశారని ఆరోపించారు. అక్కడే ఉన్న తమ అల్లుడు విలేకరిని ప్ర శ్నిస్తే ఆయన ఐడీకార్డు పోలీసులు లాక్కొని దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎస్ఐ తిరుపాలుతో పాటు పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ఆందోళనకారులను అక్కడినుంచి లేపారు.

శుద్ధజలం అందేనా?

• గత టీడీపీ హయాంలో ప్లాంట్ ఏర్పాటు • నిధుల కేటాయించని వైసీపీ ప్రభుత్వం
• నిరుపయోగంగా సామగ్రి • దృష్టి పెట్టిన ప్రస్తుత ఎమ్మెల్యే


మల్యాల వద్ద గల ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ మదర్ ప్లాంట్


బొల్లవరం గ్రామంలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణులకు మినరల్ వాటర్(శుద్ధ జలం)ను అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించింది. కానీ అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. నేటికీ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుద్ధజలం అందటం లేదు. వైసీపీ పాలనలో ఈ పథకానికి గ్రహణం పట్టుకుంది. నందికొట్కూరు మండలంలోని మల్యాల వద్ద మదర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. 12 పంచాయతీలైన అల్లూరు, మల్యాల, శాతనకోట, వడ్డెమాను, కోనేటమ్మపల్లె, కోళ్ళబావాపురం, బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం దామగట్ల, బిజినవేముల, నాగటూరు, కొణిదేల అందించేందుకు ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు డిస్పెన్సరీలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రూ.5 కాయిన్ వేస్తే మినరల్ వాటర్ వచ్చేలా రూపకల్పన చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అభివృద్ధి పరిచి చాలా వరకు శుద్ధ జలాన్ని అందించింది. వైసీపీ హయాంలో నిధుల కేటాయింపు జరగలేదు. అప్పటినుంచి మినరల్ వాటర్ పథకం కోట్ల రూపాయల సామగ్రి మూలన పడ్డాయి. కంపచెట్లతో డిస్పెన్సరీలు మూసుకుపోయాయి. సామాగ్రి, ఫిల్టర్ బెడ్లు వాడక పోవడంతో మిషన్లు తుప్పపట్టిపోయాయి. మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రస్తుత ఎమ్మెల్యే జయసూర్య చొరవతో ప్రభుత్వం నుంచి దాదాపుగా రూ.4 లక్షలు విడుదల చేయించి కొంతమేర మరమ్మతులు చేయించారు. అల్లూరు, వడ్డెమాను, కోనేటమ్మ పల్లె గ్రామాలకు శుద్ధజలాన్ని అందించేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఇంకా కొన్ని గ్రామాలకు డిస్పెన్సరీలు పనిచేయక కంపచెట్లతో నిండిపోయి పనిచేయకుండా ఆగిపోయాయి. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా ఎన్‌టీఆర్ సుజల స్రవంతి శుద్ధజల పథకానికి నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు సమకూరితే అన్ని గ్రామాలకు..

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి ప్రభుత్వం నుంచి నిధులు సమకూరితే అన్ని గ్రామాలకు శుద్ధజలం అందిస్తాం. ప్రస్తుతం మండలంలోని సుజల స్రవంతి పథకానికి కూటమి ప్రభుత్వం కొన్ని నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో పలుచోట్ల యంత్రాలను మరమ్మతులు చేయించాం. కొన్ని గ్రామాలకు నీళ్లు అందుతున్నాయి.

• అంజలిదేవి, డీఈఈ, ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : మంత్రి ఫరూక్


మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మండలంలోని తేళ్లపురి గ్రామంలో మంత్రి పర్యటించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.60 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, టీడీపీ నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, జూపల్లె రామగోపాల్‌రెడ్డి, ఉశేని, ఓబుల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

• అభయాంజనేయస్వామికి ఎమ్మెల్యే గౌరు చరిత పూజలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రంధివేముల గ్రామంలో జరుగుతున్న అభయాంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. అర్చకులు స్వామివారికి ప్రాతఃకాల, కర్తన్యాస పూజలు నిర్వహించారు. అనం తరం యంత్ర స్థాపన కార్యక్రమాలు నిర్వహించి అభయాంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. స్వామివారికి పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అభయాంజనేయ స్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రంధివేముల రామ్మోహన్‌రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


స్వామి, అమ్మవార్లకు పల్లకోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భువనేశ్వరి బృందంచే సంప్రదాయ నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నర్తనగణపతిం, తాండవ నృత్యకరి, మూషికవాహన, ఓం నమశ్శివాయ, శివాష్టకం, శివతాండవం తదితర గీతాలకు వేద, హర్షిక, అక్షర, అంజన, సహస్ర, హర్షిత, దివిజ, సుప్రియ నృత్య ప్రదర్శనతో అలరించారు.

రేపు కుంభోత్సవం

శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణార్థం ఈ నెల 15న భ్రమరాంబిదేవి అమ్మవారికి కుంభోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. కుంభోత్సవంలో గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి అమ్మవారికి సాత్వికబలిగా సమర్పించనున్నారు. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో అమ్మవారికి సాత్వికబలి సమర్పించేందుకు పౌర్ణమి తరువాత మొదటిగా వచ్చే మంగళవారం లేదా శుక్రవారం రోజున ఈ ఉత్సవాన్ని జరుపుతారు. ఈ సంత్సరం పౌర్ణమి తరువాత ముందుగా మంగళవారం రావడంతో కుంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్నిఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కుంభోత్సవం రోజున ప్రాతఃకాలపూజల అనంతరం అమ్మవారికి ఆలయ అర్చకులు నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామ కుంకుమపూజలు, జపపారాయణ నిర్వహిస్తారు. ఆచారాన్ని అనుసరించి అమ్మ వారికి ఏకాంతంగా పూజాలను నిర్వహిస్తారు. కుంభోత్సవం రోజున మధ్యాహ్నం వరకు మాత్రమే స్వామివారి సర్వదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు సాయంత్రం నుంచి స్వామివారి సర్వదర్శనం, అర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తునట్లు పేర్కొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని 13వ వార్డులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, క్లస్టర్ ఇన్‌చార్జీలు ముర్తుజావలి, లాయర్ జాకీర్, కమీషనర్ బేబి, టీడీపీ నాయకులు రమేష్, జమీల్, ఏసేపు, భరత్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రంగనాథుడి రథోత్సవం


రంగనాథస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు గ్రామంలోని శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం రమణీయంగా సాగింది. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించి రథశాలపై ఆలయ అధికారుల ఆదేశాల మేరకు స్వామివారిని ఆశీనులు చేశారు. సాంప్రదాయబద్ధంగా చేసిన పూజల అనంతరం రథాన్ని గోవిందనామస్మరణతో వేలాదిమంది భక్తుల మధ్య ముందుకు లాగారు. ఈకార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జీ శివానందరెడ్డి, దేవాలయ అధికారి సాయికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. ముందుగా దేవాలయంలో పూజలు నిర్వహించి, రథోత్సవంలో పాల్గొన్నారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, టీడీపీ యువనాయకులు గౌరుజనార్దన్‌రెడ్డి, రమణారెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బక్షాలబండ్లు అధికసంఖ్యలో..

రథోత్సవంరోజు ఉదయమే వివిధ గ్రామాల నుంచి బక్షాలబండ్లు అధికసంఖ్యలో వచ్చి స్వామివారికి సాంప్రదాయబద్ధండా నేవేద్యం సమర్పించారు. పంటలు వచ్చిన సమయంలో స్వామివారి పేరుమీద తీసిపెట్టిన ధాన్యాలతో చేసిన బక్షాలను నైవేద్యం సమర్పించి రథశాలపై ఉంచి పూజలు నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం సమర్పించి కోర్కెలు తీర్చాలని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి శ్రీరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు ఆయనకు సత్కరించారు. ఆయనవెంట మహేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడలపై మక్కువ చూపాలి

• డీఎస్పీ రామాంజినాయక్



ఏపీఎల్ లోగోను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై మక్కువ చూపాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో నిర్వహించనున్న ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను ఆదివారం ఆయన ఆవిష్క రించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. ఆత్మకూరులో క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ క్లబ్ వారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడా వేదికల ను యువత సద్వినియోగం చేసుకుని క్రీడారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. అర్బన్ సీఐ రాము, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా, సలహాదారు మునీర్‌బాషా, కేవీకే స్టేడియం ఇన్‌చార్జ్ జునైద్‌బాషా, ఖోఖో అసోషియేషన్ అధ్యక్షులు మహెబూబ్ తదితరులున్నారు.

బాలుర వసతి గృహ కమిటీ ఏర్పాటు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతునగర్ సమీపంలో ఆర్యవైశ్య విద్యార్థులకు బాలుర వసతిగృహాన్ని ఆదివారం సాయంత్రం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవీ బాలుర వసతిగృహ నూతన కమిటీ కూడా ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా నెరవాటి రవికుమార్, ప్రధానకార్యదర్శిగా బొగ్గరపు వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులుగా కూరాకు రాజశేఖర్, ఆర్ వెంకటసుబ్బయ్య, కాల్వ సత్యనారాయణ, గిద్దలూరు కిరణ్‌కుమార్, బేతంచెర్ల బచ్చుసుబ్రమణ్యం, అవుకు అలువాల సురేష్‌కుమార్, సభ్యులు పాల్గొని ప్రమాణ స్వీకారం చేశారు.

17 నుంచి శ్రీరామనవమి తిరునాళ్లు

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుకుందలో వెలసిన శ్రీరామచంద్రమూర్తి దేవస్థానంలో ఈనెల 17వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు శ్రీరామ నవమి తిరునాళ్లను వైభవంగా నిర్వహించనున్నట్లు రామాలయ అనువంశిక ధర్మకర్త కొండ కమలాకరశర్మ, అర్చకులు శశిధర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రీరామనవమి ముగిసిన అనంతరం గ్రామంలోని రామాలయంలో ఈ తిరునాలను నిర్వ హించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 17న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రాత్రి 8గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం, 18న హోమ పూజలు, శ్రీరామ అష్టోత్తర పుష్పార్చన, విష్ణుసహస్ర, హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం గ్రామస్థుల ఆధ్వర్యంలో రథోత్సవం కొనసాగుతుందన్నారు. 19వ తేదీ సాయంత్రం పారువేట మహోత్సవం, 20న ఉదయం 8గంటలకు వసంతోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చి శ్రీ సీతారాముల వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇంటర్ ఉత్తీర్ణతలో జిల్లాలో ఐదో స్థానం

సున్నిపెంట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ చదివిన విద్యార్థులు ఉత్తీర్ణతలో జిల్లాలో ఐదోవ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న తెలిపారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 69.23 శాతం ఉత్తీర్ణ సాధించి జిల్లాలో 4వ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. సిఈసి విద్యార్థిని ఎం.అమీనా 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచిందన్నారు. ఆదివారం కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

'బీపీ మండల్' సిఫారసులను అమలు చేయాలి


మండల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బడుగుల రాజ్యాధి కారం కోసం బీపీ మండల్ కమిషన్ చైర్మన్ ప్రతిపాదించిన 40 సిఫారసులను అమలు చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు, తాలుకా కమిటీ గౌరవాధ్యక్షులు రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం బిహర్ మాజీ సీఎం బాబు బిందేశ్వరీ ప్రసాద్ మండల్ వర్ధంతి సందర్భంగా స్థానిక జాతీయ బీసీ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ మండల్ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా పనిచేసి బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేష న్లను కల్పించినట్లు గుర్తుచేశారు. ఆసంఘం నాయకులు బాలస్వామియాదవ్, గోగుల తిమ్మయ్య తదితరులున్నారు.

రవీంద్రనాథ్‌కు అంబేడ్కర్ అవార్డు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాల్లో అందించిన వివిధ సేవలకు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్రనాథ్‌కు లభించిన డా.బీఆర్ అంబేడ్కర్ పురస్కారాన్ని గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్ర తినిధులు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు నాసిర్ అహ్మద్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్‌లు, మాజీ ఎమ్మెల్సీ డొక్క మాణిక్యవరప్రసాదరావు ముఖ్యఅతిధులుగా హాజరై రవీంద్రనాథ్, మాధవీలత దంపతులను ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు.

కర్షకుడికి తప్పని కష్టాలు

- ఆశాజనకంగా దిగుబడులు
- లభించని గిట్టుబాటు ధరలు
- చేతికందని పెట్టుబడులు
- అప్పు ఊబిలో అన్నదాతలు
- దందా కొనసాగిస్తున్న దళారులు

సంజామల/ రుద్రవరం ఏప్రిల్ 13: రైతులకు ఆదుగడుగునా కష్టాలు తప్పడం లేదు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధరలు మాత్రం లేవు. ఎకరా వరి పంట సాగు చేయాలంటే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. నాట్లు మొదలుకొని పంట నూర్పిడి వరకు బీద పేదలను నివారిస్తూ తీరా పంట చేతికి వచ్చాక మార్కెట్లో ధర లేక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది రబీలో సాగైన వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర అంతంత మాత్రమే ఉండటంతో రైతులు వాపోతున్నారు. 50కిలోల ఎరువు బస్తా ధర. 1800 ఉండగా 70కిలోల వరి బస్తా రూ.1300లకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరం వరి పంట సాగుకు 12 నుంచి 16బస్తాల ఎరువుల ట్రాక్టర్ దున్నుకొట్టిన బాదుగలు, నాటు కూలీలు, కలుపు కూలీలు, బీద పేదల నివారణకు క్రిమి సంహారక మందులు, నూర్పిడి కూలీలు కలిపి ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని పంట దిగుబడి 40బస్తాలు వస్తే తప్ప కాస్తో కూస్తో మిగులుతుందని రైతు లు పేర్కొంటున్నారు. ధాన్యం విక్రయాలకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారుల దందా అధికమైంది. దళారులు సిండికేట్‌గా ఏర్పడి వక్క దళారులను రానివ్వకుండా రైతు నుంచి తక్కువ ధరలకే ధాన్యాలు కొనుగోలు చేస్తున్నారు. ఓ ప్రక్క దళారుల బెడద మరోపక్క ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను అప్పుల్లోకి నెట్టివేస్తున్నాయి.


సంజామలలో కుప్పలుగా వేసిన ధాన్యం

లు దిగుబడి వచ్చింది. రైతులు ఎకరాకు రూ.25వేల నుంచి 30వేలు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

చెరువులు, కాలువ కింద సాగు

రుద్రవరం మండలం రబీ సీజన్‌లో 10,148 ఎకరాలు బోరు బావుల కింద, చెరువులు, కాల్వ ల కింద సాగుచేశారు. వరిపంట దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధర లేదని రైతులు వా పోతున్నారు. వర్షాలు కురుస్తున్న హడావుడి లో రైతులు వరి పంటను కోయడంతో వ్యా పారులు చెప్పిందే ధరగా మారింది. రైతులు ఏం చేసేది లేక 75 కేజీల బస్తాతో పాటు 3 కేజీలు అదనం గా 78 కేజీల బస్తా రూ.1350కి కొను గోలు చేస్తున్నా రు. రూ.1500 బస్తా రేటు ఉం డగా, వారంలోనే రూ.150 బస్తాపై రేటు తగ్గించా రు. ఎకరాకు సగటున 40 నుంచి 42 బస్తా


కొండమాయపల్లె సమీపంలో లారీకి ఎత్తుతున్న ధాన్యం బస్తాలు

బస్తా రూ.1380కు అమ్మేశా



రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. దిగుబడి 30 బస్తాలు దాటింది. బస్తా రూ. 1380 ప్రకారం అమ్మే శా. పంట పెట్టుబడి పోగా నాలుగునెలల కష్టానికి కాస్త ఊరట కలిగింది.
- నడిపి పుల్లయ్య వరి రైతు సంజామల

గిట్టుబాటు ధర కల్పించాలి



రబీలో సాగు చేసిన వరి ధాన్యానికి గిట్టు బాటు ధర కల్పించా లి. వ్యాపారులు చె ప్పిందే ధర కావడం తో నష్టపోతున్నాం. ఐదెకరాల్లో వరి పంట సాగుచేశా. ధర ఒక వారంలోనే తగ్గిపోతుంది. తీవ్రంగా నష్టపోతున్నాం.
- నరసింహులు, రైతు, పెద్దకంబలూరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ అధ్యాపకులు, విద్యార్థులు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984 నుంచి 1987 మధ్య డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుమారు 40సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థి మూల రామ్మోహ న్‌రెడ్డి ఆధ్వర్యంలో స్నేహితులు ఒకచోట చేరి జ్ఞాపకాలు నెమరేసుకు న్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారాలు అందిం చేందుకు ముందుకు వచ్చారు. సీనియర్ ఎకనామిస్ట్ లెక్చరర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అ ధ్యాపకులు రామక్రిష్ణారెడ్డి, ఓ.వెంకటేశ్వర్‌రెడ్డి, జోసెఫ్‌లను ఘనంగా సన్మానించారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాముసు బ్యాంక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పూర్వవిద్యార్థులు చంద్ర, కాల్వ నాగేశ్వర్‌రావు, రవి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె పట్టణంలో..

బనగానపల్లె: క్రమశిక్షణ పట్టుదల ఉంటే విజయం సాధించొచ్చని ఇంటర్మీడియట్ బోర్డు కర్నూలు జిల్లా ఆర్ఐవో గురువయ్యశెట్టి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991-93 ఇంటర్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఫిజిక్స్, ఇంగ్లిష్, కెమిస్ట్రీ అధ్యా పకులు శ్రీరాములు, సీతారామయ్య, శ్రీనివాసులు, క్రిష్టప్ప, ఆర్ఐవో గురువయ్యశెట్టి, విజయలక్ష్మీలను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్దయ్య, టీఆర్ జగన్నా థరెడ్డి, షేక్ సుభాని, రఘునాథ్‌రెడ్డి, అశోక్, బొబ్బల రామమద్దిలేటిరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందివర్గంలో...

బనగానపల్లె మండలంలోని నందివర్గం జడ్పీ హైస్కూల్‌లో 1997-2002లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ హెచ్ఎం పక్కీర్‌రెడ్డి, ఎస్‌ఏ.వెస్ట్రార్‌రెడ్డి, కుమార్‌బాబు, బాస్కర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్‌ప్రసాద్, రామకృష్ణ, రామిరెడ్డి, పద్మావతి, సురేశ్‌బాబు, వెంకటసుబ్బయ్య మొత్తం 16 మంది ఉపాధ్యాయులను పాదాభివందనం చేసి సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి స్టేజి నిర్మాణం గావించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

డోన్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపాన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఆదివారం 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించినట్లు బాలికల ప్రిన్సిపాల్ సుశీల, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఏసోబుగోపాల్ రావు తెలిపారు. 5వ తరగతికి ఉదయం జరిగిన పరీక్షకు 972 మందికి గాను 900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రవేశపరీక్షకు 556 మందికి గాను 480 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాం చనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాలను అబ్జర్వర్ ఉమామహేశ్వరప్ప పరిశీలించారు.

పేరుసోముల కోనేరులో పూడికతీత

సంజామల,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోముల గ్రామంలో ఆదివారం చిన్న కోనేరును మన ఊరు- మనగుడి -మన బాధ్యత అంటూ గ్రామస్థులు పూడికతీశారు. ఇరవై ఏళ్ల నుంచి పూడికతో నిండిపోయిన చిన్న కోనేరును గ్రామ పెద్దలు బెలుం సురేష్ రెడ్డి, చిన్న శేఖర్, శివశంకర్ రెడ్డి, నాగిరెడ్డి, ఏళ్ల శ్రీనివాసులు, శీలా వెం కటేశ్వర్లు, ఖాజా రహమతుల్లా, నరసింహ మూర్తి ఆధ్వర్యంలో గ్రామ స్థులు శుభ్రం చేశారు. కార్యక్రమానికి మన ఊరు మన గుడి రాష్ట్ర అధికారి శివశంకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది అరికట్ల మల్లికార్జున రెడ్డి, ఈవోపీఆర్‌డీలు ఆలీక్ నాయుడు, రాధికా రెడ్డి, పేరుసోముల సైన్స్ సీనియర్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పెంచిన పన్నులను ఉపసంహరించుకోవాలి'

డోన్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఇంటి పన్నులను తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పాతపేటలో ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. విలువ ఆధారిత పన్నులను, ఇంటి అద్దె పన్నులను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపడం దారుణమ న్నారు. ఈకార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు నాగమ ద్దయ్య, రామాంజనేయులు, నక్కి హరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాలు

అవుకు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీ కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆరు రోజులపాటు స్వామివారి ఉత్సవాలను భక్తులు ఆనందోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. కునుకుంట్ల గ్రామ టీడీపీ నాయకులు గూ డాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఆలయ ఈవో రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఉదయం అర్చకులు స్వాముల వారికి పూర్ణాహుతి, వసంతోత్సవం, సాయంత్రం పారువేట ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

అమరవీరులకు ఘన నివాళి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో జలియన్‌వాలా బాగ్ అమర వీరులకు ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో జలియన్‌వాలా బాగ్ దురాగతం జరిగి 106 సంవత్సరాలైన సందర్భంగా విద్యార్థులతో వసతి గృహం అధికారి ఖదీర్, అమీర్ బాష ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో ర్యాలీ నిర్వహించారు.

నేడు కంటి వైద్య శిబిరం

అవుకు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని పంచా యతీ కార్యాలయంలో సోమవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ట్లు నంద్యాల శాంతిరాం హాస్పిటల్ వైద్యులు ఆదివారం తెలిపారు. కంటికి సర్జరీలు చేయించుకోవాలనే వారు హెల్త్‌కార్డు, ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు తీసుకొని శిబిరం వద్దకు వస్తే ఉచితంగా చేస్తామని తెలిపారు.

గొడవలతో మానసిక ప్రశాంతత కరువు: సీఐ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నచిన్న కారణాలతో గొడవలకు పాల్పడితే మనిషికి మానసిక ప్రశాంతత కరువవుతుందని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ఏపిఏర్ గ్రామాలు చెందిన పాత నేరస్తులతో సమావేశం నిర్వహించారు. నేరాలకు పాల్ప డటం ద్వారా ప్రశాంతంగా ఉన్న కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఆలోచనల తీరు మార్చుకుని ప్రశాం తంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడ్డ వారిపై కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు.

విషాహారం తిని రెండు గేదెలు మృతి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో విషాహారం తిని రెండు పాడి గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బోయ లక్ష్మీ సంజీవరాయుడు ఆదియన్ మాలి రైతుకు చెందిన రెండు పాడి గేదెలను బయటికి వదిలారు. అయితే అవి గడ్డి మందు పిచికారి చేసిన విషాహారం తిని కొలిమిగుండ్ల గ్రామ శివారుల్లోని కాశిరాయిన ఆలయం సమీపంలో పొలాల్లో మృతి చెందాయి. గుర్తుంచిన రైతు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. రెండు గేదెలు రూ.90వేలకు పైగా విలువ చేస్తా యని, ఆకస్మాత్తుగా ఇలా మృతి చెందాయని వాపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ధ్వజం

డోన్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కోటి మంది దేవతలతో సమానంగా పూజించే గోమాతలపై అసత్య ప్రచారం చేసి టీటీడీ ప్రతిష్టను భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ భూమన చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమన్నారు. హిందూల మనోభావాలు దెబ్బతీస్తున్న ఆయనపై ప్రభు త్వం కేసు నమోదు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

బేతంచెర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దూదిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి చెన్నకేశవ స్వామి కల్యాణం ఆదివారం కమనీయంగా సాగింది. ఉదయం శ్రీవారికి పూజలు, పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి పూజలు చేశారు. ఈ వేడు కలను పండితులు నరేష్‌శర్మ, శివకుమార శర్మలు కమనీయంగా నిర్వ హించారు. గ్రామ దేవాలయాల ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగాయి. ఈవీ మారుతి ధర్మ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు ఈవీ సుజాతశర్మ, శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డి, బుగ్గన విశ్వనాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణంలో తాళిబొట్టు చూపుతున్న వేద పండితులు

- హనుమద్ వాహనంపై చెన్నకేశవస్వామి ఊరేగింపు

పట్టణంలోని చెన్నకేశవస్వామి తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించు కుని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను హను మద్‌వాహనంపై సాయంత్రం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు దేవస్థానం నుంచి పాత ఎమ్మార్వో కార్యాలయం, కూరగా యల మార్కెట్ మీదుగా దేవస్థానం చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, బుగ్గన విశ్వనాథరెడ్డి, గౌరి హుసేన్ రెడ్డి, వీరారెడ్డి, వెంక టేశ్వర్లు, వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.


గుండాలలో చెన్నకేశవస్వామి రథం లాగుతున్న భక్తులు

గుండాల గ్రామంలో...

డోన్ టౌన్: మండలంలోని గుండాల గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా పురోహితులు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో చెన్న కేశవస్వామి రథోత్సవాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆలంకొండ గిద్దారెడ్డి, టీడీపీ యువ నాయకుడు గిరిప్రసాద్ రెడ్డి, కొత్తకోట సర్పంచ్ చంద్రన్నయాదవ్, ఆలయ ధర్మకర్త వెంకటయ్య, జగన్, నారాయణస్వామి, హరిప్రసాద్, పాండు, రంగడు, రాముడు, రంగస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

వాగలమర్రి ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈస్టర్‌కు ముందు ఆదివారాన్ని క్రైస్తవులు ఈత మట్టలను చేత పట్టుకొని చర్చిల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాగలమర్రి ఆర్‌సీఎం, సీఎస్ఐ మార్కోమా, పెద్దబోదనం మద్దూరు, ముత్యాలపాడు, గోడిగనూరు తదితర గ్రామాల్లో మట్టల ఆదివారం పండుగను జరుపుకున్నారు. ఆయా చర్చిలలో పాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టతను తెలియజేశారు.


చాగలమర్రిలో ఈత మట్టలతో చిన్నారుల ర్యాలీ

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు, కోటకొండ, చిన్నకంబ లూరు, మండలూరు, నరసాపురం, రుద్రవరం గ్రామాల్లో క్రైస్తవులు చర్చి ల్లో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. ఈత మట్టలు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సంజామల: నొస్సం గ్రామంలో క్రైస్తవులు ఆదివారం ఘనంగా మట్టల పండుగ జరుపుకున్నారు. ఉదయాన్నే పాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మట్టలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టలు చేతపట్టుకొని చర్చి చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


పెద్దకంబలూరులో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


నొస్సం గ్రామంలో మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

పేకాటరాయుళ్లు అరెస్ట్

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మం డలంలోని హరివరం గ్రామ సమీపంలో ఉన్న కు దూరది గట్టు ముళ్ల పొదల్లో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుట్టుచప్పుడు కాకుండా గ్రామానికి చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో అక్కడి వెళ్లి దాడులు నిర్వహించామన్నా రు. వీరి నుంచి రూ. 9,150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సంజామల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంగరాయ పేటలో వెలసిన అంబా భవాని కుందేరాయ స్వామి ఆలయంలో కొలువుదీరనున్న నందీశ్వర, గ ణపతి, ఆంజనేయ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వి గ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివా రం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 11 నుంచి వేద పండితులు విరివింటి నాగభూ శర్మ, తాండ్ర సుదర్శనశర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆది వారం ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించా రు. భక్తులందరికీ బాపనార క్షత్రీయ మిత్ర బృందం అన్న దానం నిర్వహించారు.


పూజలందుకుంటున్న అంబా భవాని కందేరాయ స్వామి

వైభవంగా పల్లకీ సేవ

వాగలమర్రి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల క్షేత్రంలో హనుమద్విత జయంతి మహోత్సవాల భాగంగా ఆదివారం చె న్నకేశవ సంజీవరాయ పల్లకీ ఉత్సవాన్ని వైభ వంగా నిర్వహించారు.


ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఆలయంలో సంజీవ రాయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మకు పూజలు

వాగలమర్రి ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సమీపంలో వెలసిన పెద్దమ్మ, ముత్యాలపాడు బస్టాం డ్ సమీపంలోని గంగమ్మకు ఆదివారం ఘనంగా పూజలు చేశారు. మహిళలు బోనాలతో గ్రామోత్సవం చేశారు. అనంతరం పెద్దమ్మ, గంగమ్మ, చాగలమ్మలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం, విగ్రహాల గ్రామోత్సవం

రుద్రవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం దొర్ని లక్ష్మీనరసింహస్వామి దేవా లయ ప్రతిష్ఠలో భాగంగా ధ్వజస్తంభం, స్వామి, అమ్మ వార్ల విగ్రహాన్ని గ్రామోత్స వం ఆదివారం నిర్వహించా రు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠ పూజలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


గ్రామోత్సవం పాల్గొన్న భక్తులు

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ప్రధాని మోదీ విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బారత రాజ్యాంగాన్ని కా పాడాలని కోరారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, మం డల కార్యదర్శి నారాయణ

ఏఐటీయూసీ అధ్యక్షుడిగా అన్వర్‌బాషా

డోన్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ డోన్ ని యోజకవర్గ అధ్యక్షుడిగా ఎస్.అన్వర్‌బాషా ఎన్నికయ్యారు. ఆదివారం ఏఐటీయూసీ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిం చినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా వ ర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నడకతోనే ఆరోగ్యం

బనగానపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిత్యం కొంతసేపు నడిస్తేనా ఆరోగ్యం సొంతమవుతుందని జేకేఆర్ బ్రహ్మానందారెడ్డి అ న్నారు. ఆదివారం మండలంలోని పలుకూరులోని స్థానిక రామాల యం ఆవరణలో నడక యొక్క విశిష్టతను వివరిస్తూ కరపత్రికలను ఆవిష్కరించారు. ఒక గంట ఉదయం రోజుకు నడవాలని సూచిం చా రు. కార్యక్రమంలో బాలసరస్వతి భజమండలి అధ్యక్షుడు బాలహను మంతు, సుధాకర్ గౌడ్, వినయ్ సురేశ్, సురేంద్ర, పవన్‌కుమార్, శ్రీనివాసులు, తిమ్మక్క, సుజాత, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని యా గంటి, నందవరంలోని శ్రీచౌడేశ్వరీమాత క్షేత్రాలు ఆదివారం భక్తుల తో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చారు. క్యూలైన్‌లో స్వామివారిని దర్శించుకొని మొక్కు లు తీర్చుకున్నారు. యాగంటి క్షేత్రంలో భక్తులు వేసవి తాపానికి ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు వేశారు. భక్తులు పుష్క రిణిలో స్నానమాచరించి యాగంటి బసవేశ్వరుడిని దర్శించుకొని శ్రీ ఉమామహేశ్వరస్వామిని, శ్రీవెంకటేశ్వరగుహలను, శంకరగుహలు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నందవరంలో కూడా భక్తులు శ్రీ చౌడేశ్వరీమాతను దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

'ఇంటర్ ఫలితాల్లో కేజీఆర్ కళాశాల ప్రతిభ'

బనగానపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీఆర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెం ట్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ సోమశేఖరమూర్తి ఆదివారం తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో జమీలకు 460/470, బైపీసీలో సుభానుకు 401/440, సీఈసీలో సమీరాకు 430/500 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో బీబీ నిహా రికకు 969/1000, బైపీసీలో ఆయేషాకు 958/1000, సీఈసీలో లలితా తబుసమ్‌కు 928/1000 అత్యుత్తమ ప్రతిభ చాటినట్లు తెలి పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సదాశివ మూర్తి, అధ్యాపకులు అభినందించారు.

వ్యక్తిపై రాయితో దాడి.. గాయాలు

- ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వ్యక్తిపై రాయితో దాడి చేసి గాయపరిచిన ఘటనలో బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామంలో మెయిన్ రోడ్డు వద్దన ఉన్న రోడ్డు పనులు జరుగుతుండగా- మైక్రోప్లాన్ విష యం లో గ్రామానికి చెందిన కొండెం మహేశ్వర్‌రెడ్డి భార్య విమల, కుమా రుడు మనోజ్ రోడ్డు పని చేస్తున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుతో ఘర్షణ పడి రాయితో కొట్టి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండెకరాల్లో మొక్కజొన్న దగ్ధం

ప్యాపిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదవరం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెం డు ఎకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధమైంది. రూ.రెండులక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు తన రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికొచ్చిన స మయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పంట మొత్తం కాలిపోయింది. దీంతో రైతు శ్రీరాములు అప్పులు చేసి పంట వేశానని, అగ్ని ప్రమాదంతో పంట నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

బాదం ఆకుపై అంబేడ్కర్ చిత్రం

ప్యాపిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వెంగళాం పల్లె గ్రా మానికి చెందిన చిత్రకా రుడు మదుకృష్ణ ఆదివారం బాదం ఆకుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని గీశా డు. సోమవారం అంబేద్క ర్ జయంతిని పురస్కరించు కొని చిత్రం వేసినట్లు చిత్రకారుడు తెలి పారు. చిత్రం ఆకట్టుకునేలా ఉండటంతో పలువురు మదుకృష్ణను అభినందించారు.

